ఒరిగిన విద్యుత్ స్తంభాలతో ఆందోళన

పట్టించుకోని అధికారులు



ఆర్‌హెచ్ నగర్‌లో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు

పామర్రు: ఒరిగిన విద్యుత్ స్తంభాలతో స్థానిక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పామర్రు మొదటి వార్డులో ఉన్న ఆర్‌హెచ్ నగర్ స్థానిక నాగులేరు కాలువ గట్టుపై ఉంది. ఇక్కడ సుమారు 50కి పైగా కుటుంబాలు నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాయి. వీరి కోసం గతంలో విద్యుత్ సరఫరాకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ స్తంభాలు పక్కకు ఒరిగిపోయి విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో ఉన్నాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

ఇళ్లపైనే..

ఆర్‌హెచ్ నగర్‌లో కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు ఇళ్లపై ఒరిగి ఉన్నాయి. అవి ఎప్పుడు కూలిపోతాయోనని స్థానికులు భయం భయంగా గడుపుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకునే వారే లేరని వాపోతున్నారు. గాలివాన, వర్షాలు వచ్చిన సమయంలో స్తంభాలు ఊగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఒరిగి పోయిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చాలా భయంగా ఉంది

ఒరిగిన విద్యుత్ స్తంభాల పక్కనే నివాసం ఉంటున్నాం. చాలా భయంగా ఉంటోంది. ఎప్పుడు ఏం ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళనగా ఉంది. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను సరి చేయాలి.

– హకీమ్, స్థానికులు

స్తంభాలు ఊగుతున్నాయి

ఒరిగిన విద్యుత్ స్తంభాలతో ప్రమాదం ఏ రూపంలో వస్తుందోనని ఆందోళనలో బతుకుతున్నాం. గాలి వీచే సమయంలో స్తంభాలు ఊగుతూ ఉంటాయి. ఆ సమయంలో మరింత భయంగా ఉంటోంది. అధికారులు స్పందించి సమస్యను సత్వరమే పరిష్కరించాలి.

– బేగం, ఆర్‌హెచ్ నగర్

పరిశీలించి పరిష్కరిస్తాం

ఆర్‌హెచ్ నగర్‌లో ఉన్న సమస్యను పరిశీలించి తగు విధమైన పరిష్కారం చూపుతాం. ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదు. తగు చర్యలు తీసుకుంటాం.

– సుందరరావు, ఏడీఏ, పామర్రు

క్లుప్తంగా

అభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావాలి



గుడివాడరూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషితో పాటు దాతలు కూడా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మండలంలోని లింగవరంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన పంచాయతీ బోరును శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, మందపాటి గోపాలస్వామి, చిరంజీవిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రభావతి పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు జగదీశ్వరీకి సన్మానం



పెదమద్దాలి(పామర్రు): బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు ఆరేపల్లి జగదీశ్వరి చేసిన సేవలు నిరుపమానమని పాఠశాల హెచ్‌ఎం రాయన శివరామప్రసాద్ పేర్కొన్నారు. మండలంలో పెదమద్దాలి శివారు కొత్త పెదమద్దాలిలోని ప్రాథమిక పాఠశాల్లో శనివారం ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ కొత్త పెదమద్దాలి ప్రాథమిక పాఠశాల్లో ఎస్‌జీటీగా జగదీశ్వరి విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో కనుమూరు ప్రాథమిక పాఠశాలకు వెళ్లారన్నారు. ఎస్‌ఎంసీ చైర్మన్ దివ్య, బల్లిపర్రు పాఠశాల హెచ్‌ఎం సింహాద్రి రాము పాల్గొన్నారు.

అన్నసమారాధన



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో కార్యక్రమం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

సింగనపూడిలో భూస్వాధీనోద్యమం



మండవల్లి: ఫీల్డ్ లేబర్ సొసైటీ సభ్యులు తమ భూములను స్వాధీనం చేసుకుని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం భూస్వాధీనోద్యమం నిర్వహించారు. తొలుత ఫీల్డ్ సింగనపూడి గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి దళితులు, ఫీల్డ్ లేబర్ కో–ఆపరేటివ్ సొసైటీ సభ్యులు ఎర్ర జెండాలతో సొసైటీ భూముల వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ సింగనపూడి దళితులకు చెందిన ఫీల్డ్ లేబర్ సొసైటీ భూములను లీజు పేరుతో చెల్లించకుండా దౌర్జన్యంగా, అక్రమంగా అనుభవిస్తున్నారన్నారు. ఇది చట్ట విరుద్ధమన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు కె శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు మహంకాళీ రావు, ఎమ్మార్పీఎస్ నాయకులు వై.దానియేలు, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు శనివారం నిర్వహించారు. పాఠ్యాంశాలతో పాటు ఇతర అంశాలకు సంబంధించి విద్యార్థుల్లో చైతన్యం కల్పించాలని అధికారులు ఆదేశించారు. ఇందులో భాగంగానే చిత్రలేఖనం, నీతికథలు, ఇదితర అంశాలకు సంబంధించి ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాల్సి ఉంది.

స్టూడెంట్ కిట్ల పంపిణీ

మండవల్లి: మండవల్లి ఎంపీపీ–2 స్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర స్టూడెంట్ కిట్లను ఎంపీపీ శ్రీరామదుర్గాప్రసాద్ శనివారం పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్‌బాబు, సత్తిబాబు, విద్యాకమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు నమోదు చేయించుకోవాలి



పామర్రులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి రమేష్

పామర్రు: అర్హులందరూ తమ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని పామర్రు నియోజకవర్గ ఎన్నికల ఎలక్ట్రోరల్ అధికారి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ జి.రమేష్ పేర్కొన్నారు. స్థానిక పోలింగ్ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అర్హత ఉన్న యువతీ యువకులు తమ ఓటు హక్కు కోసం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటును వజ్రాయుధంగా ప్రతిఒక్కరూ భావించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీ రవికాంత్, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ బి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల జీతాలను పెంచండి



గుడ్లవల్లేరులో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

గుడ్లవల్లేరు: అంగన్‌వాడీ కార్యకర్తల జీతాలను పెంచాలని సీఐటీయూ మండల అధ్యక్షురాలు మేకల జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం గుడ్లవల్లేరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. కొతవరం సెక్టార్ లీడర్ విజయలక్ష్మి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చి వెంటనే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. డోకిపర్రు సెక్టార్ లీడర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జూలై 9న గుడివాడ, గుడ్లవల్లేరు బందుకు పిలుపు ఇచ్చిన ప్రజా సంఘాల ఐక్య వేదికకు సంపూర్ణ మద్దతును ప్రకటించామన్నారు. కార్యక్రమంలో గుడ్లవల్లేరు సెక్టార్ లీడర్ అమ్మాజీ, మౌనిక గ్రేస్, నాగరాజకుమారి, భవానీ తదితరులు పాల్గొన్నారు

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి



గుడ్లవల్లేరులో సమ్మె నోటీసును అందిస్తున్న పంచాయతీ కార్మికులు

గుడ్లవల్లేరు: దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని ఆయా సంఘాల నాయకులు కోరారు. గుడ్లవల్లేరు మండల మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు, గుడ్లవల్లేరు పంచాయతీ కార్మికులు ఎంతఓ జగన్మోహనరావుకు పంచాయతీ ఉద్యోగులు సమ్మె నోటీసులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా కృష్ణా జిల్లా కన్వీనర్ ధనశ్రీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లగా మారుస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు సంబంధించి కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కనీస వేతనాలు అమలు చేయాలని, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు మెనూ చార్జీలు పెంచి, కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి జూలై 9న దేశ వ్యాప్తంగా జరిగే సమయంలో గుడ్లవల్లేరులోని అన్ని రంగాల కార్మికులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ సీపీ రెడ్డి , మధ్యాహ్న భోజనం పథక నాయకులు రమాదేవి, సునీత, నదియా, పంచాయతీ కార్మికులు లక్ష్మీ, రమేష్, అరుణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణాంక దినోత్సవం



ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహలనోబీస్‌కు నివాళులర్పిస్తున్న కళాశాల యాజమాన్యం

గుడివాడ టౌన్: దేశ అభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు చేయడంలో గణాంకాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో జాతీయ గణాంక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తొలుత గణాంక పితామహులు ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహలనోబీస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గణాంక అధ్యాపకురాలు పి. శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ పాల్గొన్నారు.

● శిథిలావస్థలో ఉరుటూరు వంతెన



పామర్రు మండలం ఉరుటూరులో నాగులేరు కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరటంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. సత్వరమే వంతెనను అభివృద్ధి పర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. సుమారు 87 ఏళ్ల క్రితం ఈ వంతెన నిర్మించారు. వంతెన కింది భాగంలో శ్లాబ్ పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – పామర్రు

నేడు శ్రీ వెంకటేశ్వరుని మాస కల్యాణం

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి సన్నిధిలో ఆదివారం స్వామివార్లకు వేద పండితులు మాస కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శనివారం దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తెలిపారు. ఈ కల్యాణాన్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి కల్యాణాన్ని తిలకించాలని కోరారు.

సమ్మెకు ఆశా వర్కర్ల మద్దతు



గుడివాడ టౌన్: కార్మికుల సమస్యల పరిష్కారానికి దేశ వ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెకు తాము మద్దతు ఇస్తున్నట్లు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనశ్రీ తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ గుడివాడ కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చేయాలని కోరారు. వేతనంతో కూడిన సెలవలు, వయోపరిమితి 62 సంవత్సరాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు సరోజ, జిల్లా కమిటి సభ్యులు భవానీ, ప్రసన్న, ఆదిలక్ష్మి, హేమ, రాణి పాల్గొన్నారు.

నీటి తీరువా చెల్లించాలి

ముదినేపల్లి రూరల్: మండలంలోని రైతులు నీటితీరువా వెంటనే చెల్లించాలని తహసీల్దార్ లతీఫ్ బాషా కోరారు. కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ మండలంలో రైతుల నుంచి నీటితీరువా పన్నుగా రూ.5 కోట్లు వసూలు కావాల్సి ఉందని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



మండవల్లి: మండలంలోని గ్రామాల్లోని ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా అధికారులు వెంటనే స్పందించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం



కలిదిండి(కైకలూరు): చదువు నేర్పించిన పాఠశాలకు పూర్వ విద్యార్థులు సాయం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. కలిదిండి మండలం భాస్కరరావుపేటలో రేమల్లి సురేష్‌కుమార్, సునీల్‌కుమార్ పూర్వ విద్యార్థులు. వీరు హ్యాండ్ ఇన్ హ్యాండ్ అనే ఫౌండేషన్ ద్వారా పాఠశాల్లో చదివే 300 మందికి విద్యార్థులకు రూ.3 లక్షలు విలువ చేసే బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు వితరణగా శనివారం అందజేశారు.

అంకితభావంతో పనిచేస్తే గౌరవం



కైకలూరు: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే అన్ని చోట్ల గౌరవమని ఎంపీపీ అడవి కృష్ణ పేర్కొన్నారు. శీతనపల్లి పీహెచ్‌సీలో ఎంపీహెచ్‌ఓ జి.శ్రీనివాసరావు, ఎంపీహెచ్ ఎస్‌కె.తాతారావు బదిలీ అయ్యారు. వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వీడ్కోలు సభ శనివారం జరిగింది. ఇద్దరూ కరోనా సమయంలో అనేక సేవలు అందించారని ఎంపీపీ కొనియాడారు. అనంతరం సన్మానించారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సుబ్రహ్మణ్యం

గుడివాడ టౌన్: రాజీమార్గంలో కేసులు పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో పోలీస్ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జూలై 5వ తేదీ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం కక్షిదారులకు సులువైన మార్గంలో కేసుల పరిష్కారానికి ఈ విధానం ఏర్పాటు చేసిందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీసులు తమ పరిధిలోని కేసుల కక్షిదారులతో సంప్రదించి ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి పి.గాయత్రి, వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బాబు మోసాలపై చైతన్యవంతులను చేయండి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీపై ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బూటకపు హామీలివ్వడం మోసగించడం చంద్రబాబు నైజం అన్నారు. అగినపర్రులో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్ నివాసంలో శనివారం జరిగిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిందేమీ లేదన్నారు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. పామర్రు నియోజకవర్గం అవినీతికి కేరాఫ్‌గా మారిందని విమర్శించారు. ప్రతి మండలం నుంచి ఇద్దరు ముగ్గురు ఏజెంట్లను పెట్టుకుని ఇసుక, మట్టి, బెల్టుషాపుల నుంచి ఎమ్మెల్యే కోట్లాది రూపాయలు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. తవ్వకాలు ఆపమని కలెక్టర్ ఆదేశాలిచ్చినా రొయ్యూరు, వల్లూరు, లంకపల్లి క్వారీల్లో యథేచ్ఛగా ఇసుక దోపిడీ సాగుతుందన్నారు. అవినీతిపై పార్టీ తరపున పోరాటం చేపడతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, నాయకులు పాతూరి చంద్రపాల్, అక్కినేని సతీష్, రాజులపాటి మురళి, వీర్ల ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ భూముల పరిశీలన



దేవరపల్లిలో సొసైటీ భూములు పరిశీలిస్తున్న జేసీ గీతాంజలిశర్మ

తోట్లవల్లూరు: దేవరపల్లిలో ఎస్సీ సొసైటీ భూములను జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ శనివారం మధ్యాహ్నం పరిశీలించారు. సొసైటీ భూముల్లో ఇసుకమేటల తొలగింపునకు సంబంధిత రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. దీనిపై జేసీ గీతాంజలి శర్మ మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్, రివర్ కన్జర్వేషన్ అధికారులతో కలిసి ఎస్సీ సొసైటీ భూములను పరిశీలించారు. ఇసుక మేటల తొలగింపు సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించినట్లు సమాచారం. ఉయ్యూరు ఆర్‌డీఓ రేలా షారాన్, మైనింగ్ ఏడీ కొండారెడ్డి, తహసీల్దార్ కుసుమకుమారి, వీఆర్‌ఓ నాగేశ్వరరావు, ఆర్‌సీ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులకు భూమి పూజ

ముదినేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర కార్యదర్శి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ మండలంలోని పెయ్యేరు పంచాయతీ పరిధిలో నేజీ నిర్మాణ పనులకు శనివారం భూమిపూజ చేశారు. పంచాయతీ పరిధిలోని ఆటో నగర్ కాలనీలో డ్రెయినేజీ సౌకర్యం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీంతో సర్పంచ్ అల్లు సుశీల, ఎంపీపీ చొరవ తీసుకుని పంచాయతీ నిధులతో డ్రెయినేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ విభాగం అధ్యక్షుడు సాక్షి సాయిబాబు, నాయకులు జాస్తి చంటి, దివి సతీష్, రామారావు, శేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ లైట్ల ఏర్పాటు

మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో సర్పంచ్ పెరుమాళ్ల పద్మ ఆధ్వర్యంలో శనివారం విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. అన్ని వీధుల్లో లైట్లు వెలిగేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు బైక్‌లు అందజేత

పెనమలూరు: తాడిగడప జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో మండల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు నాలుగు బైక్‌లను డీఏస్పీ సీహెచ్.శ్రీనివాసరావు శనివారం అందజేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించటానికి, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. ట్రాఫిక్ పోలీసులకు బైక్‌లు ఇవ్వటం వలన ప్రమాదాల సమయంలో సైరన్‌తో వెంటనే స్పాట్‌కు చేరుకోగలుగుతారన్నారు. ట్రాఫిక్ గస్తీలో ఉన్న సమయంలో రూల్స్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. ట్రాఫిక్ జామ్ అయినా వెంటనే పోలీసులు బైక్‌లపై ఘటనా స్థలానికి చేరుకుని చర్యలు తీసుకుంటారని వివరించారు. ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులకు బైక్‌లు ఇవ్వటం వలన పెనమలూరు పరిధిలో విధులు సక్రమంగా నిర్వహించటానికి అవకాశం ఉంటుందన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు, ప్రమాదాల నివారణకు వాహనదారులు సహకరించాలని సూచించారు.